
సాక్షి బాపట్ల

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.50 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



అయ్యప్పలకు సద్ది ముగింపు

బాపట్ల : సోమేశ్వరస్వామి గుడిలో అయ్యప్పలకు సద్ది ముగింపు సందర్భంగా మంగళవారం పూర్ణాహుతి నిర్వహించినట్టు గురుస్వామి కొటికం సుబ్బారావు తెలిపారు.



లక్ష్మీగణపతి మహాయాగం

పెదకాకాని: మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో లక్ష్మీ గణపతి మహాయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. 15వ తేదీన ప్రారంభమైన యాగం బుధవారంతో ముగియనుంది.

న్యూస్‌రీల్

తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ బదిలీ



నూతన సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలిరూరల్: తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మంగళవారం రాత్రి బదిలీ అయ్యారు. ఆమె గ్రామ, వార్డు సచివాలయ అడిషనల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐఏఎస్ అధికారి ప్రఖర్‌జైన్‌ను తెనాలి సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రఖర్ జైన్ తన ప్రాథమిక విద్యను ఎస్‌డీఎస్ కాన్వెంట్ స్కూల్ లలిత్‌పూర్ నుంచి పూర్తి చేశారు. మధ్యప్రదేశ్‌లోని విదిసాలోని న్యూజైన్ హయ్యర్ సెకండరీ స్కూల్ నుంచి 12వ తరగతి ఉత్తీర్ణత సాధించారు. 2016లో కాన్పూర్ ఐఐటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు.

సామాజిక బస్సుయాత్ర 30వ తేదీకి మార్పు

తాడికొండ: తాడికొండలో ఈ నెల 23వ తేదీన నిర్వహించాల్సిన సామాజిక సాధికార బస్సు యాత్ర 30వ తేదీకి మార్చడం జరిగిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ మార్పును గమనించాలని వారు సూచించారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కమిటీ నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని పార్టీ పల్నాడు జిల్లా యువజన విభాగ కమిటీలో నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షునిగా పడాల సాంబశివారెడ్డి(నరసరావుపేట), ఉపాధ్యక్షులుగా డి.శ్రీనివాసరెడ్డి (మాచర్ల), యు.శ్రీను (గురజాల), ప్రధాన కార్యదర్శులుగా ఎ.వెంకటరామిరెడ్డి (పెదకూరపాడు), కె.చిన్నబాబు (నరసరావుపేట), ఎల్.అంజిరెడ్డి (వినుకొండ), డి.కృష్ణారెడ్డి (చిలకలూరిపేట), ఐ.వెంకటరామిరెడ్డి (గురజాల), కె.అంజిరెడ్డి (మాచర్ల), కార్యదర్శులుగా పి.శ్రీనివాసరావు, ఎస్.రాము (పెదకూరపాడు), వి.రాంబాబుయాదవ్, షేక్ జాన్‌సైదా (నరసరావుపేట) నియమితులయ్యారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

గుంటూరు జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్ : పేదలకు అందజేసే బియ్యంలోగానీ, నిత్యావసర సరుకుల్లోగానీ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. ఇటీవల 4,083 క్వింటాళ్ల అక్రమ బియ్యాన్ని సీజ్ చేశారు. దీనికి సంబంధించి మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేదలకు కనీస ఆహారం అందించాలని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి ఉచిత బియ్యాన్ని అందిస్తున్నాయన్నారు. వీటిని కూడా కొందరు అక్రమ మార్గంలో సంపాదించి బ్లాక్‌లో విక్రయిస్తున్నారని చెప్పారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

యార్డుకు 59,428 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 59,428 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 57,412 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి రూ.23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 25,598 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అద్దంకిలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

- 175కు 175 సాధిస్తాం
- ప్రస్తుత ఎమ్మెల్యే వెన్నుపోటు పొడిచాడు
- టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్ వైవీ సుబ్బారెడ్డి ధ్వజం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో హనిమిరెడ్డి

అద్దంకి: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన పాణెం హనిమిరెడ్డిని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎంకు బహుమానంగా ఇద్దామని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూతన ఇన్‌చార్జి హనిమిరెడ్డి పట్టణంలోని కూకట్ల కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లుగా సీఎం సంక్షేమ పథకాలతో ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా ఇంటికే పథకాల లబ్ధి చేరుతోందని చెప్పారు. అంతేకాకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. పేద ప్రజలంటే సీఎంకు ఎనలేని ప్రేమ అన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల వారికి ఏవిధమైన ఆరోగ్య ఇబ్బంది కలగకుండా ఆరోగ్యశ్రీ పథక పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. అదే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఉచితంగా వైద్యుల చేత పరీక్షలు చేయించి మందులు అందజేస్తున్నారని చెప్పారు. ఇంత మంచి చేస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలవాలని, అందులో అద్దంకి ఉండాలన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్ పెట్టిన భిక్షతో ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచాడన్నారు. పార్టీ పెట్టిన దగ్గర నుంచి పల్నాడు జిల్లాలో జగన్ వెంట నడుస్తూ ఉన్న హనిమిరెడ్డి కచ్చితంగా అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందటం ఖాయమన్నారు. ఆయన్ను అద్దంకి ప్రజలు బాగా ఆదరిస్తారని, గెలిపిస్తే పనిచేయగలిగిన సామర్థ్యం ఉన్న వ్యక్తి అని చెప్పారు. కృష్ణచైతన్యతో మాట్లాడతామని, ఆయన ఇన్‌చార్జి వెంట నిలిచి విజయానికి కృషిచేయాలన్నారు. రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, అప్పుడు చైతన్యకు మంచి గుర్తింపు ఇస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి

శాసనసభలో అడుగు పెడతా..

అద్దంకిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గెలిచి శాసన సభలో కచ్చితంగా అడుగు పెడతానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి సీఎం వైఎస్ జగన్‌కు, వైవీ సుబ్బారెడ్డికి కానుకగా ఇస్తానన్నారు. కులమతాలకు అతీతంగా ముందుకు వెళతానన్నారు. దాని కోసం నిద్రాహారాలు మాని పనిచేస్తానని చెప్పారు. తనను నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించిన దగ్గర నుంచి టీడీపీకి నిద్ర పట్టడం లేదన్నారు. వనరులను కాజేసి డబ్బు చేసుకున్న ఎమ్మెల్యే కావాలో, నిత్యం మీకు అందుబాటులో ఉండే నేను కావాలో తేల్చుకుని ఓటు వేయాలని కోరారు. తొలుత వైవీ సుబ్బారెడ్డి శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి సమావేశ హాల్ వద్దకు అడుగు పెట్టిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలపై దృష్టి

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



చినగంజాంలో విచారణ నిర్వహిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

వేటపాలెం/చినగంజాం: ఓటర్ల జాబితాల్లో వచ్చే అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారించి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాల్లో కలెక్టర్ బీఎల్‌వోలతో అత్యవసరంగా మంగళవారం సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితాలపై సమీక్షించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియపై విచారణ నిర్వహించారు. అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. 2024 జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో విచారణ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలన్నారు. చినగంజాం, వేటపాలెం మండలాల్లో ఈ నెల 9వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రక్రియ 95 శాతం పూర్తయిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ధ్రువీకరణ పత్రాలు నిబంధన మేరకు ఉన్నాయా లేదా ఆరా తీశారు. ఓట్ల తొలగింపు ప్రక్రియకు చెందిన నోటీసులు సంబంధిత పౌరులకు ఇవ్వాలని లేదా ఇంటి తలుపుకు అంటించడం, గ్రామ సచివాలయాల నోటీసు బోర్డులో వాటిని ప్రదర్శనకు ఉంచాలన్నారు. చినగంజాం మండలంలో ఇప్పటికి 400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా 25వ తేదీలోగా విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో పి సరోజినీ, చినగంజాం వేటపాలెం తహశీల్దార్‌లు పార్వతి, అశోక్‌వర్ధన్ ఉన్నారు.

ఎన్నికలకు స్ట్రాంగ్‌రూంలు ఏర్పాటు

బాపట్ల: సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్లను కట్టుదిట్ట బందోబస్తు మధ్య భద్రపరచాల్సి ఉన్నందున ఈ పరిశీలన చేపట్టామని వెల్లడించారు. 12 స్ట్రాంగ్ రూమ్‌లు అవసరం కానున్నాయని తెలిపారు. అలాగే ఓట్ల లెక్కింపు కేంద్రాలకు మరో 12 గదులు కావాలని సూచించారు. వీటికోసం కళాశాలలోని వేర్వేరు బ్లాక్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, డీఎస్పీ టి.వెంకటేశులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ ప్రభుత్వం అండ

జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్

ఇంకొల్లు (చినగంజాం): తుఫాన్ వల్ల పంట దెబ్బతిన్న ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ చెప్పారు. మంగళవారం ఆయన మండలంలోని వంకాయలపాడు, పూసపాడు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన వంకాయలపాడు ఆర్బీకేలో విలేకరులతో మాట్లాడారు. మిచాంగ్ తుఫాన్ వల్ల నియోజకవర్గంలోని ఇంకొల్లు, కారంచేడు, పర్చూర మండలాల్లో వేసిన పొగాకు, మిరప, శనగ, వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. జిల్లాలోని 25 మండలాల్లో 88,600 మంది రైతులకు దాదాపుగా 71,500 హెక్టారుల్లో పంట నష్టం జరిగినట్లు నివేదిక తయారు చేసినట్లు తెలిపారు. 20, 21, 22 తేదీల్లో మూడు రోజులపాటు రైతు భరోసా కేంద్రాల్లో పంట నష్టనమోదు జాబితాలు ఉంచుతామని వివరించారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను 25న సర్కారుకు పంపిస్తామన్నారు. నష్టపోయిన శనగ వేసిన రైతులకు 80 శాతం సబ్సిడీతో ఆర్బీకేలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దీక్ష విరమణలకు పక్కా ఏర్పాట్లు



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో రామారావు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు తదితరులు

దుర్గగుడి ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్ష విరమణలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఇంజినీరింగ్ అధికారులు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, వన్‌టౌన్ పోలీసు అధికారులతో ఈవో రామారావు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో జరిగిన సమావేశంలో గత ఏడాది భవానీ దీక్ష విరమణల సందర్భంగా దేవస్థానం చేసిన ఏర్పాట్లు, లోటుపాట్ల గురించి ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు ఈవో రామారావు దృష్టికి తీసుకెళ్లారు. జనవరి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే దీక్ష విరమణలకు పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులకు విచ్చేసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా 6వ తేదీ సాయంత్రం నుంచి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఈవో రామారావు సూచించారు.

క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన..

భవానీ దీక్ష విరమణలను పురస్కరించుకుని దేవస్థానం భక్తులకు కల్పించే సదుపాయాలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. కొండపై, వినాయకుడి గుడి వద్ద క్యూలైన్లు, కొబ్బరికాయలు కొట్టే ప్రదేశం, ఇరుముడి పాయింట్లు, హోమగుండాలు, ప్రసాదం కౌంటర్లు, అన్నదానం, టాయిలెట్స్ ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించారు. దీక్ష విరమణలు ప్రారంభమ్యే రెండు, మూడు రోజులకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు వాటిని తనిఖీ చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణం క్యూలైన్లు కట్టుదిట్టంగా ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

మాదకద్రవ్యంపైనా కక్కుర్తి

గుంటూరు ఖాకీల ఘనకీర్తి

- భయపెట్టి.. దోచుకుంటున్నారు
- మత్తు పదార్థాలను పట్టుకున్న కేసులో పోలీసుల చేతివాటం
- అనుమానితుల పేరుతో స్టేషన్‌కు పిలిపించి అక్రమ వసూళ్లు
- గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని ఒక స్టేషన్‌లో ఘటన
- ఒక కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపిన అధికారులు
- స్టేషన్ అధికారులపై ఉదాసీనం



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో ఆ సీఐ విధుల్లో చేరిన నాటి నుంచే ఆయనపై ఆరోపణల పర్వం మొదలైంది. ఏది చేసినా ఏ కేసు పట్టుకున్నా.. కాసుల వర్షం కురవాల్సిందేనన్నది ఆయన నైజమని పోలీసుశాఖలో బహిరంగ రహస్యం. తాజాగా మాదకద్రవ్యం కేసులోనూ ఆయన కక్కుర్తి చూపడం వివాదాస్పదమవుతోంది.

బెదిరింపులు.. వసూళ్లు..

మత్తు పదార్థాల కేసులో అరెస్టు చేసిన నిందితుడు లోకేష్ కాల్ లిస్ట్ ఆధారంగా కొంత మందిని స్టేషన్‌కు పిలిచిన పోలీసులు వారిని బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. గుంటూరులో పేరుగాంచిన ఒక హోటల్ యజమానిని పిలిపించి లోకేష్ కాల్‌లిస్ట్‌లో పేరు ఉందని భయపెట్టి రూ.6 లక్షలు వసూలు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కాల్‌లిస్ట్‌లో పేరు ఉందని పిలిచిన ప్రతిఒక్కరి దగ్గర నుంచి రూ.లక్షకు పైగా తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి.

కానిస్టేబుల్ బలిపశువు

ఈ అక్రమ వసూళ్ళ విషయంలో స్టేషన్ అధికారి, ఒక ఎస్ఐ, ఒక ఏఎస్ఐ, ఎప్పటి నుంచో ఐడీ పార్టీ (మఫ్టీ పార్టీ)గా పనిచేస్తున్న వ్యక్తి కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసులో ఒక కానిస్టేబుల్‌ను సోమవారం వీఆర్‌కు పిలిపించారని, అతడిని బలిపశువును చేశారని పోలీస్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కొద్ది కాలం క్రితం జరిగిన ఒక మహిళ హత్య కేసులోనూ సదరు స్టేషన్ అధికారి రూ.లక్ష తీసుకున్నారనే విమర్శలు లేకపోలేదు. ఈ అంశాలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళటంతో విచారణ చేస్తున్నట్లు సమాచారం.

తొలి నుంచి వివాదాస్పదమే?

ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వరిస్తున్న ఈ సీఐ తీరు తొలి నుంచి వివాదాస్పదంగానే ఉండడం గమనార్హం. కొంతకాలం పాటు ఒక ప్రత్యేక విభాగంలో సీఐగా పనిచేసిన ఈయన ఆ స్టేషన్ నుంచి బదిలీ అవుతున్న సమయంలో పలు సంస్థల నుంచి వచ్చే నెలవారీ మామూళ్లను అడ్వాన్స్‌ల రూపంలో తీసుకున్నారని సమాచారం. ప్రత్యేక విభాగం నుంచి బదిలీ అయిన సీఐకి ''రూ.12లక్షల సీఐ'' అని ఆ విభాగం సిబ్బంది పేరు పెట్టడం కొసమెరుపు.

విచారణకు ఆదేశించిన ఐజీ

మత్తు పదార్థాల కేసులో వసూళ్లకు పాల్పడిన విషయం బయటకు పొక్కడంతో స్టేషన్ అధికారితోపాటు మరికొంత మంది పాత్ర దీనిలో ఉందని తెలుసుకున్న గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు విచారణ చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో అక్రమ వసూళ్ల ఘటనపై ముమ్మర దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అసలేం జరిగిందంటే..

మూడు రోజుల క్రితం గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో లోకేష్ అనే వ్యక్తి వద్ద ''ఎండీఎం'' అనే మత్తు పదార్థాలు ఉన్నాయన్న పక్కా సమాచారంతో ఎస్ఈబీ పోలీసులు కాపుగాశారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి లోకేష్‌ను వెంబడించి సంపత్‌నగర్ పార్వతీపురం పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. లాలాపేట పోలీసులకు అప్పజెప్పారు. ఈ విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచిన స్టేషన్ అధికారి మీడియాకు సమాచారం తెలుపకుండా నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసులో మరో నిందితుడిగా పేరు నమోదైన గోపి అనే వ్యక్తి ఆచూకీ ఇప్పటికీ తెలియకపోవటం, అతడిని పట్టుకునేందుకు కనీస యత్నాలు కూడా చేయకపోవటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లోకేష్‌తో కాల్‌లిస్ట్ ఆధారంగా కొంత మందిని స్టేషన్‌కు పిలిపించి విచారణ చేసినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే లోకేష్ నుంచి 20 గ్రాములపైనే ఎండీఎం మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ పదార్థం ఒక గ్రాము విలువ రూ.5వేల నుంచి రూ.పదివేల వరకు ఉంటుందని తెలుస్తోంది. కొందరు బెంగళూరు, హైదరాబాద్, ముంబై ప్రాంతాల నుంచి ఈ తరహా మత్తుపదార్థాలను నగరానికి తరలిస్తున్నారని సమాచారం.

పూర్తిస్థాయిలో విచారణ



అక్రమ వసూళ్ల ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం. అధికారులు, సిబ్బంది ఎవరైనా డబ్బులు తీసుకుని ఉంటే.. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మత్తుపదార్థాల కేసులో నిందితులెవరైనా ఎంతటివారైనా పట్టుకుంటాం. అవినీతికి పాల్పడితే అధికారులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు.

– జి.పాలరాజు, గుంటూరు రేంజ్ ఐజీ

శాంతా బయోటెక్ ఎండీకి ఏఎన్‌యూ ప్రతిభా పురస్కారం



శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్ రెడ్డికి ఏఎన్‌యూ ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ కరుణ తదితరులు

ఏఎన్‌యూ(గుంటూరు): శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశిష్ట ప్రతిభా పురస్కారం ప్రదానం చేసింది. వర్సిటీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కార గ్రహీత ప్రసంగిస్తూ శాంతా బయోటెక్ ద్వారా అనేక రకాల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కరోనాకు ఔషధాలను తమ సంస్థలో తయారు చేసి ప్రపంచానికి అందించామని పేర్కొన్నారు. ప్రస్తుత యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నూతన ఆవిష్కరణలతోనే రాణింపు సాధ్యమవుతుందని చెప్పారు. ఉన్నత ఆలోచనలు కార్యరూపం దాల్చేందుకు యువత కృషి చేయాలని సూచించారు. వీసీ ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ ఔషధాల తయారీతో భారతదేశానికి శాంతా బయోటెక్ పేరుప్రఖ్యాతలు తెచ్చిపెట్టిందని తెలిపారు. ఈ సంస్థను ఆదర్శంగా తీసుకుని సమాజ హితానికి దోహదం చేసే నూతన ఆవిష్కరణలు జరగాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ కె.సునీత, ప్రిన్సిపాల్స్ కె.గంగాధరరావు, పి.సిద్దయ్య, ఇ.శ్రీనివాసరెడ్డి, ఎ. ప్రమీలారాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అంబేడ్కర్ స్మృతివనం కన్వెన్షన్ ట్రెస్‌వర్క్ ప్రారంభం



కన్వెన్షన్ హాల్ ట్రెస్‌వర్క్ పనులకు శంకుస్థాపన చేస్తున్న శ్రీలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): స్థానిక స్వరాజ్య మైదానంలో ఏర్పాటవుతున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతి వనంలో కన్వెన్షన్ హాల్ ట్రెస్‌వర్క్ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులకు మునిసిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేపీసీ డైరెక్టర్ పి.వాసుదేవరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. జనవరి 20, 2024 కల్లా స్మృతివనం పనులు పూర్తవుతాయని తెలిపారు. అంబేడ్కర్ స్మృతివనాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి, జాతికి అంకితం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. మిగిలిన ల్యాండ్ స్కేపింగ్, రూఫ్, శ్లాబ్, శాండ్ స్టోన్ జాలి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలిపేలా ఆయన బాల్యం, విద్య, ఉద్యోగం, రాజకీయ జీవితం, పోరాటం, రాజ్యాంగ నిర్మాణంలోని ఘట్టాల ఛాయా చిత్రాలు, వస్తువులను ప్రదర్శించేందుకు మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

పిడుగురాళ్ల పట్టణంలో విజిలెన్స్ దాడులు

పిడుగురాళ్ల: పట్టణంలో వివిధ జనరల్ స్టోర్స్‌పై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పిడుగురాళ్ల పట్టణంలో అక్రమంగా అనుమతులు లేని(ట్యాక్స్ చెల్లించబడిన) నిషేధించిన, ఆరోగ్యానికి హానికరమైన సిగరేట్లు అమ్ముతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వివిధ షాపుల్లో తనిఖీలు నిర్వహించగా ఎన్‌డీపీజీ(నాన్ డ్యూటీ పెయిడ్ గూడ్స్) సిగరెట్లు అమ్ముతున్న వారిని గుర్తించారు. గోల్డ్ విమల్ బ్రాండ్ 43, గోల్డ్ స్టైఫ్ బ్రాండ్ 21, గోల్డ్ స్టైఫ్ పెద్దవి 5, పారిస్ బ్రాండ్ బిగ్ 3 మిత్తం 83 ఔటర్ బాక్సెప్ విలువ రూ.1,06,000 విలువ ఉంటుందని విజిలెన్స్ అధికారులు తెలిపారు. చట్టం 2003 సెక్షన 20(2) క్రింద పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వీఆర్వోను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.శ్రీనివాసులురెడ్డి, స్థానిక అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం

భర్త మృతి చెందిన మరుసటి రోజే భార్య మృతి



క్రోసూరు: మరణంలోనూ వీడని బంధం వారిద్దరిది. భర్త మృతి చెందిన మరుసటి రోజే తనువు చాలించిన భార్య. ఈ సంఘటన క్రోసూరు ఎస్సీకాలనీలో చోటుచేసుకున్నది. చిల్కా దాసు(69), లీలావతి భార్యాభర్తలు. లీలావతి 2014–19 సంవత్సరంలో క్రోసూరు సర్పంచ్‌గా పనిచేసింది. దాసు (69) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమం పూర్తి చేసుకుని ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికి లీలావతి(65) మృతి చెందింది. వీరికి వివాహితులైన ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. క్రోసూరు గ్రామ ప్రజలకు సర్పంచ్‌గా సుపరిచితురాలు. మాజీ సర్పంచ్ లీలావతి, ఆమె భర్త ఒకేసారి మృతి చెందటంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పలువురు గ్రామస్తులు దాసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



క్రిస్మస్ వేడుకలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఏసుక్రీస్తు ప్రేమ, దయ, గుణాలు ప్రజలందరికీ మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. జిల్లా క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు–హైటీ కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశం మందిరంలో జరిగింది. పాస్టర్లతో కలిసి జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా క్రిస్మస్ కేకు కట్ చేశారు. పాస్టర్లు జిల్లా కలెక్టర్‌కు కేకు తినిపించగా, తదుపరి పాస్టర్లకు జిల్లా కలెక్టర్ కేక్ తినిపించారు. ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, అనురాగాలు, ప్రజల మునగడ, జీవన శైలిని మార్చేశాయని చెప్పారు. ప్రజల కోసం ఆయన ప్రాణత్యాగం చేశారని, ప్రపంచ దేశాలన్నీ ఆయనను అనుకరిస్తున్నాయన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మానవుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా తోడ్పాటునందించాలన్నారు. ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. జిల్లాలోని ప్రజలంతా సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలన్నారు. జిల్లా ప్రజలకు కలెక్టర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్ మాట్లాడుతూ ప్రేమ, త్యాగాలకు ప్రతీకగా ఏసుక్రీస్తు నిలిచారని అన్నారు. ఆయన బోధనలు అనుసరణీయమన్నారు. ఆయన మార్గంలో క్రైస్తవ సంస్థలు ఎన్నో వెలిశాయన్నారు. ఉచితంగా విద్య, వైద్య, సామాజిక సేవలు అందిస్తున్నాయని వివరించారు. కుల, వర్గ భేదాలు లేకుండా క్రైస్తవులు మెలగడం సంతోషదాయకమన్నారు. అందరిలో శాంతి సమాధానం నెలకొల్పేందుకు ఏసుక్రీస్తు భూమిపై అవతరించారని పాస్టర్ థామస్ అన్నారు. తదుపరి క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ రోషన్ జమీర్ బాషా, కలెక్టరేట్ ఏఓ కె.గోపికృష్ణ, చీరాల పాస్టర్ల సంఘం అధ్యక్షులు రాజేష్, ఎం.జాన్, నాగలీల, పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమగ్ర రీ సర్వే వేగవంతం చేయాలి

- జిల్లా సర్వే అధికారి ఎండీ అల్తాఫ్
- భట్టిప్రోలులో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమీక్ష



భట్టిప్రోలులో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలతో సమీక్షిస్తున్న జిల్లా సర్వే అధికారి ఎండీ అల్తాఫ్

భట్టిప్రోలు: మూడో విడత భూ సమగ్ర రీ సర్వే బాపట్ల జిల్లా వ్యాప్తంగా 76 గ్రామాల్లో జరుగుతుందని, ఇప్పటి వరకు 11 గ్రామాల్లో పూర్తయినట్లు జిల్లా సర్వే అధికారి ఎండీ అల్తాఫ్ చెప్పారు. మంగళవారం ఆయన భట్టిప్రోలు విచ్చేసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమీక్షించారు. అల్తాఫ్ మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోగా నూటికి నూరు శాతం సర్వే పూర్తి చేయడమే కాక పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. ఒకే సర్వే నెంబర్‌లో ఇద్దరు రైతులు ఉంటే వారికి ఇబ్బందులు కలుగకుండా సర్వే నిర్వహించాలని, సర్వే నిర్వహించే ముందు వారికి నోటీసులు అందచేసి సర్వే చేయాలని అన్నారు. రైతులు ఒక వేళ అభ్యంతరం వ్యక్తం చేస్తే వారి దగ్గర నుంచి లిఖితపూర్వకంగా అర్జీ తీసుకోవాలని సూచించారు. సర్వే ఎందుకు వద్దంటున్నారో కూడా తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ లోకనాథ్, తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

నందిరాజుతోటలో మలేరియా అధికారుల పర్యటన



గృహాన్ని సందర్శించి దోమల స్థావరాలను పరిశీలిస్తున్న మలేరియా అధికారులు

బాపట్ల అర్బన్: ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని నందిరాజుతోటలో మంగళవారం మలేరియా డిపార్ట్‌మెంట్ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజు పర్యటించారు. గతంలో డెంగ్యూ జ్వరం బారిన పడిన గృహాన్ని సందర్శించి పరిసర ప్రాంతాల్లో దోమల స్థావరాలను నిశితంగా పరిశీలించి నివారణ కోసం పలు సూచనలు చేశారు. వర్షపు నీరు, కాలువల్లో మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని, టైర్లు, కొబ్బరి చిప్పలు, తొట్లు, డబ్బాల్లో వర్షం నీరు చేరి దోమల ఉత్పత్తి జరుగుతోందని అలాంటి వాటిని తొలగించాలని మలేరియా అధికారి తెలిపారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిరంతరం నిర్వహించడం ద్వారా దోమల పెరుగుదలని అరికట్టడానికి పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తద్వారా దోమల ద్వారా సంక్రమించే మలేరియా, బోదకాలు, చికెన్ గున్యా, డెంగ్యూ జ్వరాలు రాకుండా నిరోధించవచ్చునని వీర్రాజు చెప్పారు. అసిస్టెంట్ డైరెక్టర్‌తోపాటు కొన్ని ఇళ్లని జిల్లా మలేరియా అధికారి రాజకుమార్, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, వైద్య శాఖ సిబ్బంది పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు.

సమష్టి కృషితో క్రీడాకారులుగా రాణించాలి

- రేమాండ్స్ అధినేత టి.అరుణ్‌కుమార్
- ముగిసిన ఏఎన్‌యూ మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్



కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అరుణ్‌కుమార్, కేవీ బ్రహ్మం, మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: సమష్టి కృషితో క్రీడాకారులుగా రాణించాలని రేమాండ్స్ అధినేత టి.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన ఏఎన్‌యూ అంతర్ కళాశాలల మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు ఇంటర్నెట్, మొబైల్, ఫేస్‌బుక్‌తో సమయం వృథా చేయకుండా క్రీడాసక్తిని పెంచుకుని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించాలన్నారు. ఇటువంటి పోటీలను అవకాశాలుగా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. 35వ డివిజన్ అధ్యక్షుడు టీఎల్‌పీ వీరాంజనేయులు మాట్లాడుతూ ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓడినంత మాత్రాన అధైర్య పడకుండా మరలా కష్టపడి గెలవాలని చెప్పారు. అనంతరం విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. గుంటూరులోని హిందూ కళాశాల ద్వితీయ, కందుకూరులోని టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల తృతీయ, చోడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు నాలుగో స్థానంలో నిలిచారు.

గాంధీ మెమోరియల్ క్లబ్ జట్టు విజయం

నరసరావుపేట: స్థానిక ఎస్‌కెఆర్‌బీఆర్ ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఫుల్ మెంబర్ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రెసిడెంట్ కప్‌లో భాగంగా మంగళవారం గుంటూరు గాంధీ మెమోరియల్ క్లబ్, ఏలూరు బ్లాక్ షర్ట్స్ క్రికెట్ క్లబ్ జట్ల మధ్య ఒన్‌డే మ్యాచ్ నిర్వహించారు. గాంధీ మెమోరియల్ క్లబ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన బ్లాక్ షర్ట్స్ జట్టు 37.1 ఓవర్లలో 121పరుగులకు ఆల్ అవుట్ అయ్యారు. బ్లాక్ షర్ట్స్ క్రికెట్ క్లబ్‌లోని సాయి లక్ష్మణ్ 21పరుగులు చేయగా, గాంధీ మెమోరియల్ క్లబ్‌లోని భాను చైతన్య మూడు వికెట్లు, పరంధామ్ రెండు వికెట్లుసాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన గాంధీ మెమోరియల్ క్లబ్ 31.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయానికి కావల్సిన 122 పరుగులు చేశారు. గాంధీ మెమోరియల్ క్లబ్‌లోని భానుచంద్ యాదవ్ 53పరుగులు చేయగా బ్లాక్ షర్ట్స్ క్రికెట్ క్లబ్‌లోని సాయి రామచరణ్ రెండు వికెట్లు సాధించారు. ఏసీఏ ఫుల్ మెంబర్ క్లబ్ టోర్నమెంట్ ఈనెల 25 వరకు నిర్వహించబడుతుందని టోర్నమెంట్ పరిశీలకులు ఎ.శ్రీనివాస్ తెలిపారు.

నెట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు..



ఎంపికైన విద్యార్థులు రామారావు, చరణ్‌తేజ్

చిలకలూరిపేట: జాతీయస్థాయి నెట్‌బాల్ సబ్‌జూనియర్ పోటీలకు ఏఎంజీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. విజయవాడలోని మేరీస్టెల్లా డిగ్రీ కళాశాలలో ఈ నెల 18వ తేదీన నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఏఎంజీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థులు కుంచపు రామారావు, తమ్మిశెట్టి చరణ్‌తేజ్ పాల్గొని విశేష ప్రతిభ కనపరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి నెట్ బాల్ సబ్ జూనియర్ పోటీలలో పాల్గొంటారు. ఈ విద్యార్థులకు మంగళవారం ఏఎంజీ ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, హైస్కూల్ హెచ్‌ఎం ఎం.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ అభినందించారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు శ్రీలక్ష్మి ఎంపిక..



ప్రథమ బహుమతి సాధించిన శ్రీలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హరికృష్ణ

నరసరావుపేటరూరల్: జేఎన్‌టీయూఎన్ అంతర కళాశాలల అథ్లెటిక్స్ మీట్‌లో నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థిని కె.శ్రీలక్ష్మి ప్రథమ బహుమతిని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరికృష్ణ మంగళవారం తెలిపారు. సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూఎన్ అంతర కళాశాలల అథ్లెటిక్స్ మీట్‌లో కళాశాల ఈసీఈ నాలుగో ఏడాది విద్యార్థిని శ్రీలక్ష్మి పాల్గొని లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో ప్రథమబహుమతి సాధించినట్లు వివరించారు. ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు శ్రీలక్ష్మి ఎంపికైనట్లు వివరించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఇద్దరి ఎంపిక



జగదీష్‌ను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు విజయకుమార్

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి జూనియర్స్(అండర్–17) స్విమ్మింగ్ పోటీలలో ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఏడు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. ఏపీ సబ్ జూనియర్, జూనియర్ అంతర జిల్లాల శీతాకాలం అక్వాటిక్(స్విమ్మింగ్) చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 16, 17 తేదీలలో ఎస్ఎస్అండ్ ఎన్ కళాశాల స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలలో కళాశాల బీకాం మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్.జగదీష్ 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, బటర్‌ఫ్లై ఈవెంట్స్‌లో, 200 మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో బంగారు పతకాలు, వంద మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో రజిత పతకం సాధించాడు. జూనియర్ ఇంటర్ విద్యార్థి వై.మధుకుమార్ 50 మీటర్లు, బటర్‌ఫ్లై ఈవెంట్స్‌లో రజిత పతకం, వంద మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. ఇద్దరు బెంగళూరులో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్తా, ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య అభినందించారు.

'లఘు ఉద్యోగ భారతి' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తులసి యోగిష్

కొరిటెపాడు(గుంటూరు): సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభ్యున్నతి , సేవలకై కేంద్ర స్థాయిలో 1995లో ఏర్పాటైన 'లఘు ఉద్యోగ భారతి' రాష్ట్ర స్థాయిలో తమ సేవలను విస్తృత పరిచే కార్యక్రమంలో భాగంగా స్థానిక అరండల్‌పేటలోని యోగి భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి లఘు ఉద్యోగ భారతి ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జ్, నేషనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.అనంత్ అధ్యక్షత వహించారు. లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర ప్రెసిడెంట్ మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తులసి యోగిష్ లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

క్రైస్తవం మతం కాదు జీవన విధానం



గ్రాండ్ క్రిస్మస్ వేడుకలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, డాక్టర్ జోయ్ పి.మధు, డాక్టర్ జెస్సీవీణ

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా

గుంటూరు ఎడ్యుకేషన్: క్రైస్తవం మతం కాదు జీవన విధానమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా పేర్కొన్నారు. జెడ్పీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ సంయుక్తంగా మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో 16వ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వరి లవ్ ఆఫ్ జీసస్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ జోయ్ పి.మధు, రెవరెండ్ డాక్టర్ జెస్సీ వీణ క్రిస్మస్ సందేశమిచ్చారు. అనంతరం హెనీక్రిస్టినా కేకు కోశారు. ఏ వ్యక్తి అయితే అవధులు లేని ప్రేమను చూపిస్తూ ప్రతీకారం, ఈర్ష్య, అసూయ, ద్వేషం వంటివి మరచిపోతాడో అతడే నిజమైన క్రైస్తవుడని, మనలోని ఆతీ్మయ తృష్ణ చల్లారేంత వరకు, క్రీస్తు మన హృదయంలో జన్మించేంత వరకూ మనం ఆయన కోసం ఎదురు చూడాలని అన్నారు. ఎప్పుడైతే ఆయన మన హృదయాల్లో జన్మించడం వలన నిజమైన శాంతి నెలకొంటుందో, అప్పుడు జనులకు వేరే సాక్ష్యాలు అవసరం లేదన్నారు. అది మన జీవితాల ద్వారా ప్రతిబింబిస్తుందని, కేవలం వ్యక్తిగతంగానే కాకుండా సామాజికంగా మార్పు కనపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, న్యూటన్ నెమలికంటి, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన బాపట్ల జిల్లావాసులు



గంగదేవిపల్లి అభివృద్ధిని వివరిస్తున్న జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి

గీసుకొండ (వరంగల్) : వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాకు చెందిన పలు గ్రామాల ప్రతినిధులు, గ్రామ వికాస్ పీస్ ఫౌండేషన్ బాధ్యులు మంగళవారం సందర్శించారు. వేటపాలెం, చిన్నగంజ మండలాల్లోని వినాయకపురం, పార్వతీపురం, మహాలక్ష్మీకాలనీ, ప్రభుదేవా కాలనీలు, 30 మంది గ్రామ అభివృద్ధి సంఘాల ప్రతినిధులు, రామన్నపేట సర్పంచ్ కె.రమణ గంగదేవిపల్లి అభివృద్ధి తీరుతెన్నులను పరిశీలించారు. జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి, బాలవికాస అసోసియేట్ కొట్టె రమాదేవి గ్రామ అభివృద్ధి వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రాజెక్టు ఆఫీసర్ వి.బసవయ్య, ఆర్‌ఎంపీ జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.